క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఎల్‌ఓసీ అందజేత



షర్మిలకు ఎల్‌ఓసీ అందజేస్తున్న సబితారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లోని కమ్మగూడకు చెందిన షర్మిల ఇటీవల ఓ ప్రమాదంలో కాలు పోగొట్టుకుంది. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కును బుధవారం బాధిత మహిళకు అందజేశారు. ఇంకా అవసరమైతే తన సొంత నిధుల నుంచి అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు జంగయ్య, మాజీ కౌన్సిలర్ యాదగిరి, నాయకులు జంగారెడ్డి, విజయ్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన



బొడ్రాయికి పూజలు చేస్తున్న కార్తీక్‌రెడ్డి

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఇమామ్ గూడలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా సాగింది. అనంతరం మహా కుంభాభిషేకం, శాంతి పూజలు, మహా నివేదన మంగళహారతి తదితర కార్యక్రమాలు చేశారు. భక్తులు, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి బొడ్రాయిని దర్శించుకున్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తాం

కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో గల ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న మన ఊరు – మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలను ప్రభుత్వం రూ. 16 లక్షలతో అభివృద్ధి చేస్తోందన్నారు. ఇప్పటికే పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి సబితారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాహుల్, విక్రమ్, శివ, పాండు తదితరులు పాల్గొన్నారు.

మన్సాన్‌పల్లి చౌరస్తాకు యాదయ్య పేరు పెట్టండి

ఎంపీడీఓకు టీడీపీ నాయకుల వినతి

మహేశ్వరం: మన్సాన్‌పల్లి చౌరస్తాకు తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు బుధవారం ఎంపీడీఓ నర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్మాటి నరేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా అమరవీరుడు యాదయ్య కుటుంబానికి న్యాయం జరగలేదని.. మన్సాన్‌పల్లి చౌరస్తాకు యాదయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మండలంలోని ఉద్యమకారులు, అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంపై తెలుగుదేశం పార్టీతో కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిప్పశెట్టి మల్లేష్, సత్యనారాయణ, చంద్రునాయక్‌లు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మహేశ్వరం: మహేశ్వరం మండలం చిన్న తూప్ర గ్రామానికి చెందిన కక్కులూరి పోచమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించింది. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ సర్పంచ్ కొండా రఘుపతి.. అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మంగమ్మ తదితరులు

తుర్కయంజాల్: దశలవారీగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. బుధవారం తుర్కయంజాల్‌లోని లక్ష్మీగార్డెన్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త కుర్మ శివకుమార్, కాలనీవాసులు నరేందర్ రెడ్డి, భాస్కర్‌రావు, రమేష్, మధునూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా..

- ఫ్రీడం ఎకో పార్క్ శ్మశానవాటిక
- ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు అక్కడే..
- తాగి గొడవలకు దిగుతున్న ఆకతాయిలు
- ఇబ్బందుల్లో సమీప కాలనీవాసులు పట్టించుకోని అధికారులు



ఫ్రీడం ఎకో పార్కు

బడంగ్‌పేట్: పట్టణంలోని ఫ్రీడం ఎకో పార్కు(శ్మశానవాటిక) మందుబాబులకు అడ్డాగా మారింది. గ్రామం మధ్యలో శ్మశానవాటిక ఉండడం ఆకతాయిలకు కలిసొచ్చింది. రెండు ఎకరాల్లో ఉన్న ఈ ఫ్రీడం ఎకో పార్కును హరితహారంలో భాగంగా అభివృద్ధి చేశారు. సమాధులు లేని ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అయితే వాటి ఆలనాపాలనా చూసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించారు. పెద్ద స్వాగత బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ పార్కు చుట్టూ టెలిఫోన్, సుబ్రహ్మణ్యం కాలనీతోపాటు మరి కొన్ని బస్తీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ఆకతాయిలు తెల్లవారింది మొదలు అర్ధరాత్రి వరకు ఇక్కడే మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో కాలనీ వాసులపై గొడవలకు దిగుతున్నారు. అంతేకాకుండా మద్యం తాగి అక్కడే బాటిళ్లు, చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో శ్మశానవాటికి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక పోలీసులు మందుబాబులు ఏకో ఫ్రీడం పార్కులోకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులను కట్టడి చేయాలి



పట్టణంలోని ఫ్రీడం ఎకో పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. కాలనీల మధ్య శ్మశానవాటిక ఉండడంతో ఆకతాయిలు ప్రహరీ దూకి అందులో మద్యం తాగుతున్నారు. మున్సిపల్ అధికారులు, మీర్‌పేట పోలీసులు నిఘా ఉంచి మందుబాబులను కట్టడి చేయాలి.

– బంగారు బాబు, టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడు

వీఓఏల సమస్యలు పట్టవా ?

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు

కందుకూరు: కింది స్థాయి ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని సీఐటీయూ మండల కన్వీనర్ బీ బాల్‌రాజు పేర్కొన్నారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ అంటూ చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వానికి వీఓఏల సమస్యలు పట్టవా అని బాల్‌రాజు ప్రశ్నించారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత, సీసీలుగా పదోన్నతులు, గుర్తింపు కార్డుల జారీతో పాటు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు కవిత, రజని, పద్మ, శారద, బాలమణి, మాధవి, శశికళ, సంగీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నిరసన తెలుపుతున్న వీఓఏలు

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కందుకూరు: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు బుధవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు డీ రాం చందర్, మండల కార్యదర్శి బీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 788లో 2007లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, పట్టా సర్టిఫికెట్లు జారీ చేసినా కబ్జా చూపలేదన్నారు. 2022 అక్టోబర్‌లో పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగించారన్నారు. సర్టిఫికెట్లు ఉన్న వారికి స్థలం చూపాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.కుమార్, బీ బాల్‌రాజు, ఆర్.శేఖర్, జి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఒకే ఓటు నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్
- మహేశ్వరం నియోజకవర్గ ఓటరు సర్వే
- ఎన్నికల నిర్వహణపై సమావేశం

మీర్‌పేట: మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ సర్వే, ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలు సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఎల్‌ఓలు స్థానిక రాజకీయ నాయకులతో సమన్వయం చేసుకుని ఇంటింట ఓటరు సర్వే చేసి, ఒక వ్యక్తికి ఒకే ఓటు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మరణించిన వారి ధ్రువీకరణ పత్రం తీసుకొని జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా ఒకే ఇంటి నంబర్‌పై 6 లేదా అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాళ్ల జాబితాను పునః పరిశీలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓ ఎన్నికల అధికారిగా రానున్న ఎన్నికలు సజావుగా జరిగేందుకు తోడ్పడాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఓటర్ రీ వెరిఫికేషన్ జరుగుతున్న విధానం గురించి ఆర్డీఓ రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు. దీంతో పాటు నాయకులు ఇచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించి తగు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. బాలాపూర్ మండల తహసీల్దార్ జనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు పీ జంగయ్యగౌడ్, పీ నర్సింహ, జీ శ్రీనివాస్, డీ భూపేష్‌గౌడ్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



అన్నోజిగూడలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎం జ్యోతి పాండు, జెడ్పీటీసీ బీ జంగారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ధన్నారం, అన్నోజిగూడలో ఆయా గ్రామాల సర్పంచులు శ్రీదేవి, ఇందిరతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రవీందర్, నాయకులు దేవేందర్, కృష్ణారెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, వెంకటేష్, నర్సింహ, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో కంటి వెలుగు శిబిరం

రంగారెడ్డి జిల్లా: ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకుని అవసరమున్నవారికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి నారాయణ, కంటివెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాగ్యలక్ష్మి, వీహెచ్ తిటుస్, ప్రణతీ, ఆశవర్కర్లు కవిత, సబిత, అంగన్ వాడీ కార్యకర్తలు వసంత, హేమలత, సంగీత పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

తలకొండపల్లి: ఓటర్ కార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేయించాలని డీటీ సంతోష్ అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ.. ఒకే ఇంటి నంబర్‌తో 6మంది పైచిలుకు ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఓటర్లు అందరూ ప్రస్తుతం ఒకే ఇంటిలో నివసిస్తున్నారా లేదా అని విచారణ చేపట్టాల్సి ఉందన్నారు. మండలంలో 143 మందికి చెందిన ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నాయని, అవి మార్చడానికి ఓటర్ యొక్క ఆధార్‌కార్డును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

సీపీఐ ప్రజాగర్జన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: సీపీఐ ప్రజా పోరుబాట యాత్ర (ప్రజాగర్జన) ముగింపు సభ వాల్ పోస్టర్‌ను బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కొత్తగూడెంలో జరిగే బహిరంగసభతో ఈ యాత్ర రాష్ట్రంలో ముగుస్తుందని నేతలు తెలిపారు. సీపీఐ నాయకులు యాదయ్య, రాజు నాయక్, అలీమొద్దీన్, అనంతరెడ్డి, విజయకుమార్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

మానవ తప్పిదాలతోనే ప్రకృతి వైపరీత్యాలు

మీర్‌పేట: భారతీయ సంస్కృతి అతి పురాతనమైనదని, నా దేశం.. నా సంస్కృతి అనే భావన నేటి తరం పిల్లల్లో కలిగించాలని సిల్వర్ డ్రాప్స్ పాఠశాలల చైర్మన్ శ్రీనివాసరావు తల్లిదండ్రులకు సూచించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ పాఠశాలలో 10రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముఖ్యఅతిథులుగా శ్రీనివాసరావు, ప్రముఖ ప్రవచన కర్త వేముల రాజేశ్వరరావు హాజరై మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే ప్రకృతి వైపరీత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే జ్ఞానం మనిషికి మాత్రమే ఉంటుందన్నారు. మంచి గుణాలు ఉన్నవాడే మానవుడు అవుతాడని అన్నారు. విద్య అనేది పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శిక్షణ తరగతుల్లో పిల్లలకు ఆటపాటలు, శ్లోకాలు, భజనలు, కీర్తనలు, యోగా, విద్యతో పాటు విలువలతో కూడిన విషయాలను నేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ బాధ్యులు అహల్య, విద్యుత్ శాఖ అధికారి రమణ, అప్పం రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

థియేటర్ లావాదేవీల విషయంలో గొడవ

కోర్టు ఆదేశాలతో పలువురిపై కేసు

వనస్థలిపురం: వనస్థలిపురం రైతు బజారు సమీపంలోని సంపూర్ణ థియేటర్ లావాదేవీల విషయంలో పార్ట్‌నర్స్ అయిన తమను థియేటర్ నిర్వాహకులు సామ రంగారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి మోసం చేస్తున్నారని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ సామ జంగారెడ్డి పోలీసులను కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కుమారులు మధుకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. సంపూర్ణ థియేటర్‌లో పలువురు భాగస్వాములు ఉండగా అందులో తమకు 15 శాతం వాటా ఉందని, థియేటర్‌కు సంబంధించి ఏషియన్ వారి నుంచి వారానికి రెండు లక్షల రూపాయల లీజ్ వస్తుంటే తమకు సరైన లెక్కలు చూపించకుండా సామ రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి మోసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారి ఆదేశాల మేరకు పోలీసులు సామ రంగారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నియోజకవర్గంలోని శివారు కాలనీలలో ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అవసరం ఉన్న చిన్న చిన్న వాటర్ పైప్‌లైన్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు పక్కపక్కనే ఉండడం వలన నీరు కలుషితం అవుతుందని వెంటనే వాటిని గుర్తించి వేర్వేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. పైప్‌లైన్ల కోసం ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక తయారు చేయాలని సూచించారు. గత వర్షాకాలంలో పలు కాలనీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసం అయిందని వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా: కార్యకర్తలకు సభ్యత్వమే శ్రీరామ రక్ష అని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడకు చెందిన షేక్ రహీం ఇదివరకు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ప్రమాదవశాత్తు ఇటీవల రహీం మరణించాడు. దీంతో పార్టీ తరుపున ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. బీమా చెక్కును బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు గ్రామంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా రహీం భార్య గౌసియాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గోపాల్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మండుటెండలో పనులు చేయొద్దు

- ఉదయం 6 గంటలకే పనులకు రావాలి
- ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం: ఉపాధీ హామీ పనులకు కూలీలు ఉదయం 6 గంటలకే వచ్చి తొందరగా ముగించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ సూచించారు. బుధవారం రాయపోల్ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల తీరును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండుటెండల్లో పనులు చేయవద్దన్నారు. పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. తనతోపాటు ఏపీఓ, ఈసీ తదితర అధికారులు ఉపాధి పనులను పరిశీలించి కొలతలపై కూలీలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బ్యాంకుకు ఆధార్‌కార్డు లింకు చేయని కారణంగా, ఒకే కూలీకి రెండు నుంచి మూడు ఖాతాలు ఉండటం వలన వారికి డబ్బుల చెల్లింపులు జరిగినా తెలియడంలేదన్నారు. ఆధార్ లింకు ఉన్న ఖాతాల్లో ఉపాధి కూలీ డబ్బులు పడుతున్నట్లు గమనించాలన్నారు. అనంతరం ముకునూర్ గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరపతిచారి, టెక్నికల్ అసిస్టెంట్ రవి, సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండలంలోని శంకరకొండతండాలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నర్సరీని, తండాలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విధిగా చేపట్టాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంత ఉండేలా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చి, ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్, స్థానిక నాయకులు పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కలలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేసి చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, ఆరోగ్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు జహంగీర్, నాగులునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, సతీష్, సుమన్‌నాయక్, శేఖర్, గోపి, శివ, హర్ష, కళ్యాణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.